

'గురువుల' ప్రాధాన్యత ఎవరో!
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక రసవత్తరంగా మారింది. 15మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉపాధ్యాయుల సమస్యలే ప్రచారాస్త్రాలుగా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. 8లో▸



సమస్యల బస్టాండ్
బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలతో ప్రయాణికులు సతమతం అవుతున్నారు. తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 36.0 /21.0
ఆకాశం మబ్బుపట్టి ఉంటుంది. ఉత్తరం దిశగా వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

చెన్నూర్: జిల్లాలో సర్వర్ సమస్యతో పది రోజులకు పైగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సర్వర్‌తో పని లేకుండా మాన్యువల్‌గా కొనుగోళ్లు చేపట్టాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేయడంతో రైతుల సమస్యలను వివరించారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను సంప్రదించారని తెలిపారు. ఆయన సీసీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లలిత్‌కుమార్‌తో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారని పేర్కొన్నారు. జిల్లా రైతులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభమవుతాయని ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు.

మాజీ విప్ ఓదెలుకు అస్వస్థత

మందమర్రిరూరల్: ప్రభుత్వ మాజీ విప్, కాంగ్రెస్ నాయకుడు నల్లాల ఓదెలు నాలుగు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, బీఆర్ఎస్ చెన్నూర్ ఇంచార్జి డాక్టర్ రాజారమేష్‌తో కలిసి ఆసుపత్రిలో ఓదెలు కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్యులను కలిసి ఓదెలు ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు రవీందర్, తిరుపతి రెడ్డి, సంపత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో వైద్య సేవల పరిశీలన



మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సభ్యులు

మంచిర్యాలటౌన్/జన్నారం: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలను పాపులేషన్ రీసెర్చ్ సెంటర్(పీఆర్సీ) విశాఖపట్టణం బృందం రెండో రోజు బుధవారం పరిశీలించింది. మంచిర్యాల మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల ప్రసవాలు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఎస్‌ఎన్‌సీయూ వార్డును సందర్శించి వైద్య సేవలతోపాటు అన్ని రకాల వైద్య పరికరాలు, మౌలిక వసతులు పరిశీలించారు. చిన్నారులకు వేసే వ్యాక్సిన్ల లభ్యత, సరైన సమయాల్లో వేస్తున్న వ్యాక్సిన్లను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం జిల్లాలోని ఇందన్‌పల్లి సబ్ సెంటర్, జన్నారం పీహెచ్‌సీ, హాజీపూర్ పీహెచ్‌సీ, లక్సెట్టిపేట పీహెచ్‌సీ, దొనబండ సబ్‌సెంటర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్, మంచిర్యాల ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, ఆర్‌ఎంవో డాక్టర్ భీష్మ, హెచ్‌వోడీ డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ పవన్, ఎంసీహెచ్ పీవో డాక్టర్ కృపాబాయి, పీఆర్సీ వైద్యులు, రీసెర్చ్ సైంటిస్టులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి



డీపీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు


మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే ఇప్పించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ కుమార్‌దీపక్, డీపీఓ వెంకటేశ్వర్‌రావును కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పెట్రోల్ బంక్‌ల్లో పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ పోయడం లేదని, ఆగస్టు నుంచి చెక్కులు పెండింగ్‌లోనే ఉండడం వల్ల ఆర్థిక భారాన్ని తాము మోయలేమని పేర్కొన్నారు. మార్చి నెల నుంచి ఖర్చులు భరించే స్థితిలో లేమని తేల్చిచెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు పూదరి నరేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు, తాజొద్దీన్, శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుమన్, వరప్రసాద్, క్రాంతి, సంయుక్త కార్యదర్శి దివాకర్, కార్యాలయ కార్యదర్శి రమణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధిలో ఊరట

- జీడీడీపీ, తలసరి ఆదాయం మెరుగు
- విద్యార్థుల డ్రాపౌట్స్, పోషకాహారం లోపం
- పెరుగుతున్న వాహన, విద్యుత్, రోడ్ల పరిధి
- తెలంగాణ రాష్ట్ర గణాంక నివేదికలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి జిల్లాలో అభివృద్ధిలో కొంత ఊరట కనిపిస్తోంది. జిల్లాలో జరుగుతున్న ఉత్పత్తి, వినియోగం, ప్రజల ఆదాయ స్థితిగతుల్లో కొంత మేర వృద్ధి నమోదవుతోంది. విద్యార్థులు బడి మానేయడం, మాతాశిశు సంరక్షణలో పోషకాహార లోపం, జీడీడీపీ, తలసరి ఆదాయం ఇతర జిల్లాలతో పోలిస్తే ఇంకా వెనుకబడి ఉంది. రాష్ట్ర ప్రణాళికశాఖ తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ రాష్ట్ర గణాంక నివేదిక'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. పలు రంగాల్లో ఉమ్మడి జిల్లా మిశ్రమ వృద్ధి కనిపిస్తోంది. రాష్ట్రంలో అత్యధిక ఎస్సీ జనాభా మంచిర్యాల జిల్లాలో ఉంది. రాష్ట్ర మొత్తం షెడ్యూల్డ్ కులాల జనాభాలో ఇక్కడే 24.7శాతం ఉంది.






జీడీడీపీ 2022-23 (ఎఫ్‌ఆర్‌ఈ)
ఆదిలాబాద్ | ఆసిఫాబాద్ | మంచిర్యాల | నిర్మల్

జీడీడీపీ పెరుగుదల

ఒక జిల్లా పరిధిలో ఒక ఆర్థిక సంవత్సరం జరిగిన అంతిమ వస్తు సేవల వినియోగాన్నే ఆ జిల్లా(గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) జీడీడీపీగా పేర్కొంటారు. ఈ సూచిక అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుంది. రాష్ట్రంలో కుమురంభీం, నిర్మల్ జిల్లాల జీడీడీపీ మెరుగు కావాల్సి ఉంది. 33జిల్లాల్లో మంచిర్యాల 20వ స్థానం, ఆసిఫాబాద్ జిల్లా 32, ఆదిలాబాద్ 24, నిర్మల్ 25 స్థానాల్లో ఉన్నాయి. ఇంకా రాష్ట్రంలో అనేక జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి జిల్లా ఆర్థిక స్థితి మెరుగుపడాల్సి ఉంది.

తలసరి ఆదాయం(2022-23) (ఎఫ్‌ఆర్‌ఈ)




ఆదాయం కాస్త మెరుగు

ఒక జిల్లా జనాభాను ఆ జిల్లా జీడీడీపీతో భాగిస్తే తలసరి ఆదాయం వస్తుంది. ఈ తలసరి ఆదాయంలోనూ ఉమ్మడి జిల్లా కాస్త మెరుగుపడినప్పటికీ ఇంకా ఇతర జిల్లాలతో పోలిస్తే వెనుకబడి ఉన్నాయి. గత ఐదేళ్లలో క్రమంగా వృద్ధి నమోదవుతోంది. భవిష్యత్‌లో ఇదే వృద్ధి కొనసాగితే కొంత ఆర్థిక పుష్టి సాధించే అవకాశం ఉంది. రాష్ట్రంలో మంచిర్యాల 20వ స్థానం, నిర్మల్ 23, ఆదిలాబాద్ 24, ఆసిఫాబాద్ 32వ స్థానాల్లో ఉన్నాయి.

వాహనాల రిజిస్ట్రేషన్లు (2023-24)



వాహన రిజిస్ట్రేషన్లు పెరగడంతోపాటు ఇటీవల విద్యుత్ వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి.



డ్రాపౌట్స్ ఎక్కువే..

డ్రాపౌట్ రేట్(శాతం)

జిల్లా	ప్రైమరీ	అప్పర్ ప్రైమరీ	హైస్కూల్
ఆదిలాబాద్	1.29	4.97	16.54
ఆసిఫాబాద్	1.80	7.39	16.39
మంచిర్యాల	-0.14	2.60	20.39
నిర్మల్	2.69	2.59	17.72

విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి

జిల్లా	ప్రైమరీ	అప్పర్ ప్రైమరీ	హైస్కూల్	హయ్యర్ సెకండరీ స్కూల్
ఆదిలాబాద్	18	16	21	17
ఆసిఫాబాద్	17	17	22	17
మంచిర్యాల	16	13	18	17
నిర్మల్	18	15	18	17

విద్యారంగంలో ఇప్పటికీ చాలామందికి విద్య అందని ద్రాక్షగానే మారుతోంది. ప్రభుత్వ స్కూళ్లలో సరైన సౌకర్యాలు లేక నమోదు క్రమంగా పడిపోతోంది. అంతేగాక డ్రాపౌట్స్ ఇంకా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఆసిఫాబాద్ జిల్లాలో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉండగా, మంచిర్యాలలో తక్కువగా ఉంది. విద్యార్థులకు టీచర్ల నిష్పత్తి తక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం 1నుంచి 5వరకు ప్రతీ 30మంది విద్యార్థులకు ఒక టీచరు, 6నుంచి 8వరకు 35మందికి ఒక టీచరు ఉండాలి. కానీ అంతకంటే తక్కువగా ఉన్న విద్యార్థుల కంటే టీచర్ల సంఖ్య అధికంగా ఉంది.

- ఉమ్మడి జిల్లాలో స్వయం సహాయ సంఘాలు, సభ్యుల సంఖ్య పెరుగుతోంది. రుణ పరిమితి పెరుగుతూ క్రమంగా వృద్ధి కనిపిస్తోంది.
- వాహన రిజిస్ట్రేషన్లు పెరగడంతోపాటు విద్యుత్ వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి.
- మాతాశిశు సంరక్షణలో ఇంకా పోషకాహార లోపంతో మహిళలు, చిన్నారులు ఉన్నారు. ఇప్పటికీ ఆయా కేంద్రాల్లో నమోదైన వారికి పూర్తి స్థాయిలో పోషకాహారం అందడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నా వంద శాతం పోషకాహార రహితంగా మార్చేందుకు ఇంకెంత కాలం పడుతుందనే ప్రశ్నలు ఉత్పన్నవుతున్నాయి.
- ఉమ్మడి జిల్లాలో క్రమంగా జాతీయ రహదారుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటికే ఎన్‌హెచ్-44, 64, 363తోపాటు కొత్తగా పలు రోడ్లు అప్‌గ్రేడ్ కావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది.

	జీవాలు			మాతా సంరక్షణ పోషకాహారం (2023-24)			మహిళా స్వయం సహాయక సంఘాలు				పోషకాహారలోపం 7నెలలు-6ఏళ్లు(2023-24)		
జిల్లా	పౌల్ట్రీ	మేకలు	గొర్రెలు	నమోదైన మహిళలు	పోషకాహారం పొందినవారు	శాతం	సంఘాలు	సభ్యులు	బ్యాంకు రుణాలు పొందిన సంఘాలు	మొత్తం (రూ.కోట్లలో)	నమోదైన చిన్నారులు	పోషకాహారం పొందినవారు	శాతం
ఆదిలాబాద్	5,54,211	1,86,322	1,53,202	11,964	9263	77.4	10,751	116859	4704	220.9	49,370	41,663	84.4
ఆసిఫాబాద్	4,55,807	2,59,958	1,60,958	8957	6777	75.7	7973	89104	3608	160.7	42,497	32,303	76.0
మంచిర్యాల	8,68,144	1,83,526	5,20,731	9647	7341	76.1	10,162	114029	6606	420.2	42,445	33,579	79.1
నిర్మల్	5,29,904	1,36,587	5,44,741	12,263	9401	76.7	11994	135260	8197	472.2	52,684	41,127	78.1





విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్
- మండలంలో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం: వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సిద్ధం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని, వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బుధవారం ఆయన మండలంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కిష్టాపూర్ కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. తరగతిగదులు, వంటశాలలు, నిత్యావసర సరుకుల నిల్వలు, పారిశుద్ధ్యం, భోజనం నాణ్యత, రిజిష్టర్లు పరిశీలించారు. విద్యార్థులను స్వయంగా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాయించారు. బోర్డుపై లెక్కలు ఇచ్చి పరిష్కారం చేయించారు. ఆస్పత్రిలోని వార్డులు, రిజిష్టర్లు పరిశీలించి రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మందులు, సేవలపై వైద్యాధికారులు జి.ఉమాశ్రీ, జే.లక్ష్మిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిష్టాపూర్ గ్రామ సమీపాన ఉన్న కేజీబీవీని తనిఖీ చేశారు. ప్రత్యేక అధికారి ఎం.శ్రీవాణిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు.

శిబిరాలను దివ్యాంగులు వినియోగించుకోవాలి

బెల్లంపల్లి: అవసరమైన సహాయ ఉపకరణాలు పొందడానికి నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి సింగరేణి కళా వేదికలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అలీమ్‌కో సంస్థ సిబ్బంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీ క్షల ఆ ధారంగా సహాయ ఉపకరణాలు అందిస్తామని ప్రకటించారు. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని మండలాల నుంచి దివ్యాంగులు తరలి వచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్, ఆర్డీవో హరికృష్ణ, సీడీపీవో స్వరూపరాణి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి
- జిల్లాలో బైక్ ర్యాలీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): యువతకు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో దొనబండ నుంచి హాజీపూర్ వరకు రాంపూర్ ఆవాస విద్యాలయం విద్యార్థుల ఘోష్ విన్యాసాలు, మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తుండగా మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు పోలీసులు, నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పోలీసుల తీరుపై రఘునాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తే 21మందిపై కేసులు పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉగాది వరకు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శివాజీ సేవా సమితి సభ్యులు స్వామిరెడ్డి, మోటపలుకుల తిరుపతి, బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, బేతు రవి, జూపాక ధర్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రఘునాథ్

లక్సెట్టిపేటలో..
లక్సెట్టిపేట: స్థానిక బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో బుధవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మండల నాయకులు ప్రభాకర్, దిలీప్, ఉమేష్, వెంకటేష్, హరీష్, రాజయ్య, గురువయ్య, సంతోష్, సురందర్, హరిగోపాల్, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచిర్యాలలో..
మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ టాకీస్ చౌరస్తా వద్ద శివాజీ విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ మంచిర్యాలలో ఛత్రపతి శివాజీ విగ్రహం స్థాపనకు ఐదేళ్లుగా కలెక్టర్, అధికారులు అనుమతి ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. విగ్రహ స్థాపనకు అనుమతి ఇచ్చి, లక్ష్మీ టాకీస్ చౌరస్తాకు శివాజీ చౌక్‌గా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్ణకంటి రవీందర్, బోయిని హరికృష్ణ, కిరణ్, మున్నారాజా సిసోడియా, పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్దన్, మోటూరి కిరణ్, వంగపల్లి వెంకటేశ్వర్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, చిరంజీవి, బెల్లంకొండ మురళి పాల్గొన్నారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కుమురంభీం సేవా సమితి, ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

క్లుప్తంగా

అటవీప్రాంతంలో కార్చిచ్చు



డొంగర్‌గాం అటవీ ప్రాంతంలో కార్చిచ్చు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అటవీ ప్రాంతంలో బుధవారం కార్చిచ్చు వ్యాపించింది. ఇంద్రవెల్లి అటవీశాఖ పరిధిలోని దొడంద, చిచ్‌ధరి, ఖానాపూర్, అంజీ, వడగామ్, డొంగర్‌గాం, వడగామ్, పులిమడుగు తదితర అటవీ ప్రాంతంలో కార్చిచ్చు కారణంగా చెట్లు, హరిత హారంలో నాటిన మొక్కలు కాలిపోయాయి. దీంతో అటవీ జంతువులు, పక్షులకు రక్షణ లేకుండా పోయింది. వేసవిలో జాగ్రతలు తీసుకోవాల్సిన అటవీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలవాసులు పేర్కొన్నారు.

భార్యపై హత్యాయత్నం.. భర్తకు రిమాండ్



గుట్టె అంకుష్ (ఫైల్)

ఇంద్రవెల్లి: భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో భర్తను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దనోరా(బి) గ్రామానికి చెందిన గుట్టె అంకుష్ మంగళవారం మండలకేంద్రంలోని తన భార్య సంజీవాణి తోపాటు అత్త కేంద్రే అనిత, అమ్మమ్మ రాధాబాయిలపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు గుండెపోటు

- సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన పోలీసులు

కడెం: మండలంలోని పాండ్వపూర్ వద్ద అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న దస్తురాబాద్ పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గోకుల్‌దాస్ బుధవారం గుండెపోటుతో కుప్పకూలాడు. సిబ్బంది అందించిన సమాచారంతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డితోపాటు ధన్‌రాజ్, భీంరావు, దేవన్నలు అక్కడికి చేరుకున్నారు. గోకుల్‌దాసును అంబులెన్స్‌లో ఎక్కించి సీపీఆర్ చేస్తూ ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నిర్మల్‌కు తీసుకెళ్లి ప్రాణాలు కాపాడారు.

పట్టపగలే చోరీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లింగోజీతండాకు చెందిన ఆర్టీసీ కండక్టర్ రాథోడ్ దశరథ్ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. దశరథ్ బుధవారం ఇంటికి తాళం వేసి ఉదయం 9గంటలకు డ్యూటీకి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో తులంన్నర బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. దశరథ్ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అక్కడికి చేరుకుని..క్లూస్‌టీం ద్వారా పరిశీలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

వాంకిడి: మండలంలోని ఖమానలోని నర్సరీ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పక్కాసమాచారంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.8280 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘గురువుల’ప్రాధాన్యత ఎవరో!

- బరిలో మొత్తం 15మంది అభ్యర్థులు
- ఉపాధ్యాయ సమస్యలే ప్రచార అస్త్రాలు
- ఆసక్తికరంగా టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఆసక్తికరంగా సాగుతోంది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ స్థానానికి 15మంది బరిలో ఉన్నారు. 27,088మంది ఓటర్లు ఉన్నారు. ముగ్గురు రాజకీయ పార్టీల నుంచి పోటీలో ఉండగా, మరో 12మంది ఆయా సంఘాల మద్దతుతో బరిలోకి దిగారు. ఎగువ సభకు ఎన్నికల్లో మేధావి వర్గంగా చెప్పుకునే విద్యావంతులైన టీచర్ల ఆలోచన సరళి చాలా భిన్నంగా ఉంటుందంటారు. అభ్యర్థి, పార్టీ, సంఘం ఏదైనా తమ విచక్షణతోనే ఓటు వేస్తూ వైవిధ్యతను చూపిస్తుంటారు. గతంలో పలుమార్లు అంచనాలకు అందకుండా తీర్పు ఇచ్చారు. ఈ క్రమంలో టీచర్లు వేసే మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్ల క్రమంలో ఎటు వైపు మొగ్గు ఉన్నా ఫలితాలు తలకిందులయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎవరి గెలుపు ఉంటుందనేది సర్వత్రా చర్చ సాగుతోంది.

సమస్యలే ప్రచారాస్త్రాలు

ఉపాధ్యాయులను ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న సమస్యలు అనేకంగా ఉన్నాయి. ప్రతీసారి ఆయా సమస్యలే ఎన్నికల్లో ఎజెండాగా మారుతున్నాయి. తాజా ఎన్నికల్లోనూ అవే ప్రచారాస్త్రాలుగా మారాయి. ప్రధానంగా సీపీఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం), ఏకీకృత సర్వీస్ రూల్, 317జీవో, 2002 ఉపాధ్యాయుల సమస్యలు, డీఏల పెండింగ్, టీచర్ల పదోన్నతులు తదితరవన్నీ పేరుకుపోయాయి. ఎమ్మెల్సీగా గెలిచాక సమస్యలు మర్చిపోతున్నారనే అపవాదు మూటగట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రధాన పార్టీల నుంచి పరిశీలిస్తే ఈసారి బీజేపీ నుంచి వ్యాపారవేత్త మల్క కొమురయ్య పోటీలో ఉన్నారు. ఆయన గెలుపు కోసం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆ బాధ్యతను తమ భుజాలకెత్తుకున్నారు. బీజేపీ ప్రభుత్వం టీచర్లను ఇబ్బంది పెడుతున్న సీపీఎస్‌ను తీసుకొచ్చిందనే కారణంతో పార్టీ అభ్యర్థికి ఏ మేరకు ఓట్లు పడుతాయనేది తేలాల్సి ఉంది. ఆయన యజమానిగా ఉన్న మంచిర్యాలలోని శాలివాహన ప్లాంటు మూసివేత, కార్మికుల సమ్మె ప్రభావం ఉండనుంది.



ప్రచారంలో టీచర్లతో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య

ఇంటింటికి అభ్యర్థి ప్రచారం

ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్కూళ్లలో ప్రచారం చేసే అవకాశం లేకపోవడంతో నేరుగా టీచర్ల ఇంటికే వెళ్తున్నారు. మార్నింగ్ వాకింగ్, సంఘ కార్యాలయాలు, సెలవు దినాలు, నిర్ణీత వేళల్లోనే టీచర్లను కలుస్తూ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా, ఫోన్ కాల్స్‌తోనూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

టీఎస్‌సీపీఎస్‌ఈయూ నుంచి ఇన్నారెడ్డి

సీపీఎస్ రద్దు ఏకైక లక్ష్యంగా సాగుతున్న టీఎస్‌సీపీఎస్‌ఈ యూనియన్ బలపర్చిన అభ్యర్థిగా తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి బరిలో ఉన్నారు. గతంలో పీఆర్‌టీయూ రాష్ట్ర స్థాయి నాయకుడిగా, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డికి ఉపాధ్యాయ సమస్యలపై పోరాటమే తన బలంగా చెబుతుంటారు. ఇప్పుడు ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి టీచర్ల స్థానానికి అధికారికంగా ఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వలేదు. తెరవెనక మాత్రం ఓ అభ్యర్థికి మద్దతు ఉందని ఉపాధ్యాయ వర్గాల్లో ప్రచారం ఉంది. ఇక తాజా మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మరోసారి పోటీలో నిలిచారు. పీఆర్టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, బీఎస్పీ నుంచి యాటకారి సాయన్న, దళిత బహుజన పార్టీ నుంచి గవ్వల లక్ష్మీతోపాటు అశోక్‌కుమార్, వై.కంటె సాయన్న, చలిక చంద్రశేఖర్, జగ్గు మల్లారెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, ముత్తరాం నర్సింహస్వామి, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్, సుహాసిని మొత్తం 15మంది ఉన్నారు.

ఓసీపీల్లో పచ్చదనం పెంచాలి

- సింగరేణి అడ్వైజరీ మోహన్‌చంద్ర పర్గెన్

శ్రీరాంపూర్: సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులపై పచ్చదనాన్ని పెంచాలని సింగరేణి అడ్వైజరీ (ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్) మోహన్ చంద్ర పర్గెన్ (ఐఎఫ్‌ఎస్) తెలిపారు. బుధవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల జీఎంలు, ఫారెస్ట్, ఎన్విరాన్‌మెంట్ అధికారులతో ఆయన చర్చించారు. ఏరియాల పరిధిలో ఫారెస్ట్ భూములు, చేపడుతున్న పర్యావరణ పరిరక్షణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. అనంతరం కంపెనీ పరిధిలోని భూములు అందులో చేసిన ప్లాంటేషన్ వివరాలను తెలుసుకున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మోహన్‌చంద్ర పర్గెన్

సమావేశంలో శ్రీరాంపూర్,మందమర్రి, బెల్లంపల్లి జీఎంలు ఎం.శ్రీనివాస్, దేవేందర్, నరేందర్, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీనివాస్, కార్పొరేట్ ఎస్టేట్ అధికారులు, సునీల్ వెంకటాచార్యులు, ఆయా డిపార్టుమెంట్ల అధికారులు పాల్గొన్నారు.

ఆకాశవాణి కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రాన్ని ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఇంజనీరింగ్) బానోత్ హరిసింగ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రోతలకు నాణ్యమైన ప్రసారాలను అందించేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ విషయంలో ఆదిలాబాద్ ఆకాశవాణి ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి రాబోయే రోజుల్లో ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం పేరును గొప్పగా నిలపాలని ఆకాంక్షించారు. ఆదిలాబాద్ కేంద్రానికి ఉన్న ప్రత్యేక గుర్తింపును కొనసాగించాలని సూచించారు. ఈ కేంద్రం అభివృద్ధికి తనవంతుగా తోడ్పాటును అందిస్తానన్నారు. అనంతరం జైనథ్ మండల కేంద్రంలోని పురాతన శ్రీ లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్ ఇంజనీరింగ్ శ్రీనివాస్, కేంద్రం ముఖ్య కార్యక్రమ అధికారి రామేశ్వర్ కేంద్రే, వెంకటేశులు, పోతురాజు, శశికాంత్, గిరీశ్‌కుమార్, వెంకటయ్య, విజయ కుమారి తదితరులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న బానోత్ హరిసింగ్

గల్ఫ్‌లో జిల్లావాసి బలవన్మరణం

- మృతదేహం తెప్పించాలని కుటుంబీకుల వినతి
- ప్రవాసీమిత్ర సంఘం అధ్యక్షుడిని కలిసి వేడుకోలు

నిర్మల్‌ఖిల్లా: బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన కార్మికుడు అక్కడే బలవన్మరణానికి పాల్పడ్డాడు. జిల్లాలోని సారంగాపూర్ మండలం బోరిగాం గ్రామానికి చెందిన షేక్ అన్సర్ (34) ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం సౌదీ ఆ తర్వాత దుబాయ్ వెళ్లాడు. ప్రస్తుతం దుబాయ్‌లోని పూజైరాదిబ్బ మున్సిపాలిటీలో కార్మికుడిగా పనిచేసేవాడు. గతేడాది సెలవుపై స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. ఈనెల 16న దుబాయ్‌లో నివాసముంటున్న ప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడి కంపెనీ ఈ విషయాన్ని తాజాగా కుటుంబీకులకు సమాచారం అందించింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులతోపాటు కాంగ్రెస్ నాయకులు ఏనుగు ముత్యంరెడ్డి, కొర్వ నవీన్, సతీశ్ తదితరులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్లను కలిశారు. మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించాలని విన్నవించారు. గల్ఫ్ కార్మిక సంఘానికి చెందిన అక్కడి ప్రతినిధులతో మాట్లాడి దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీ కార్యాలయానికి ఈ–మెయిల్ ద్వారా అన్సర్ వివరాలను పంపించారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడుతోపాటు తల్లిదండ్రులు ఉన్నారు.



ప్రవాసీమిత్ర సంఘం అధ్యక్షుడికి వినతిపత్రం అందిస్తున్న కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నేతలు

సరిహద్దుల్లో నిఘా

- ప్రత్యేక చెక్‌పోస్టులు..తనిఖీలు
- అమల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి
- రూ.50 వేలకు మించితే ఆధారాలు తప్పనిసరి

- బాసర మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో బాసర–ధర్మాబాద్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో వారం క్రితం వాహనాల తనిఖీ చేపట్టారు. ధర్మాబాద్ నుంచి బిద్రెల్లి వైపు వస్తున్న కుంటాల మండలానికి చెందిన వ్యక్తి కారులో రూ. 2.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి రశీదులు, ఆధారాలు చూపకపోవడంతో కేసు నమోదు చేశారు.
- పది రోజుల క్రితం మహారాష్ట్రలోని బోకర్ నుంచి నిర్మల్‌కు వస్తున్న ఓ వాహనాన్ని తానూరు మండలం బెల్‌తరోడా చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అందులో రూ.3 లక్షలకు పైగా నగదును గుర్తించారు. సరైన పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

నిర్మల్‌ఖిల్లా: గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తోంది. మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్–నిజామాబాద్–కరీంనగర్–మెదక్ జిల్లాల పరిధిలో ఎన్నికల నియమావళి అమల్లో ఉండడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈనెల 27న జరిగే పోలింగ్‌కు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నగదు వ్యవహారాలు, తాయిలాలపై ఎన్నికల అధికారులు దృష్టిసారించారు. నిర్మల్ జిల్లాకు ఆనుకుని మహారాష్ట్ర సరిహద్దు ఉండడంతో ఆయా ప్రాంతాల్లో నిఘాతోపాటు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కొనసాగిస్తున్నారు. వివిధ అవసరాల నిమిత్తం రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే తగిన ఆధారాలు, రశీదులు చూపాలని లేకపోతే సీజ్ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నగదుతోపాటు బంగారం వెండి ఆభరణాలు కొనుగోలు చేస్తే రశీదులు వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వివాహ వేడుకల సీజన్‌లో వధూవరుల కుటుంబీకులు వస్త్రాలు, బంగారం, తదితర వస్తువులు కొనేందుకు నగదుతో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



బెల్‌తరోడా చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు(ఫైల్)

ప్రత్యేక చెక్‌పోస్టులు

నిర్మల్ జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు సారంగాపూర్, తానూరు, కుభీర్ తది తర మండలాలతో అనుసంధానంగా ఉన్నా యి. ఆయా ప్రాంతాల్లోని సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ము మ్మరం చేశారు. రెండు రాష్ట్రాల ఆర్టీసీ బస్సులు ప్రైవేట్ వాహనాలు, బైక్‌లు వివిధ అవసరాల రీత్యా రాకపోకలు సాగిస్తుంటాయి.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

సోన్: విద్యుత్‌షాక్ గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై కె.గోపి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన మోరే చంద్రకాంత్ లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి పసుపు కోసం మంగళవారం వచ్చాడు. గ్రామంలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగోరావు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రిమ్స్‌లో యువకుడు..

కై లాసనగర్: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాహూర్ తాలుకాలోని కోడ్‌కుప్టి గ్రామానికి చెందిన యువకుడు సెలార్ అంకుష్ (20) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై ముకుంద్‌రావు కథనం ప్రకారం.. అంకుష్ ఈనెల 3న శుభకార్యానికి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు మహారాష్ట్రలోని కోర్టలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై తెలిపారు.

లక్ష్మణచాందలో ఒకరు..

లక్ష్మణచాందా: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన పవర్ రమేశ్ (35) గత మూడు రోజుల క్రితం గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పదంగా ఒకరు ..

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లీకి చెందిన జంగమోల్ల రాజేశ్వర్(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం..మృతుడు రాజేశ్వర్ రాహుల్‌నగర్‌లోని ఓ గురుకుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. కొన్నిరోజులుగా ఖాళీగా ఉంటుండగా, ఈ క్రమంలో బుధవారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించాడు. గమనించిన కుటుంబీకులు ఏరియాస్పత్రికి తరలించారు. సీఐ ఆస్పత్రికి చేరుకుని మృతదేహం పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

అదృశ్యమైన మహిళ హత్య



కొండ లక్ష్మి(ఫైల్)

మోర్తాడ్: నెల రోజుల క్రితం అదృశ్యమైన మహిళ హత్యకు గురైంది. ఈ ఘటనకు సంబంధించి భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై రాము బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్‌కు చెందిన కొండ లక్ష్మి(45) గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేస్తోంది. ఈ ఏడాది జనవరి 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమార్తె అనూష ఏర్గట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్‌కు చెందిన కొంచపు వెంకటేశ్ లక్ష్మిని నమ్మించి తనవద్దకు పిలిపించుకొని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా నెల రోజుల క్రితమే ఆమెను పొన్కల్ అటవీ ప్రాంతంలో హత్య చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు?

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని తిలక్‌నగర్‌లో మూడురోజుల క్రితం 25 కిలోల గంజాయితోపాటు సుమారు 9 మంది నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇందులో కొందరిని తప్పించేందుకు రాజకీయ నాయకుల ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. నిందితులను కేసు నుంచి తప్పించేందుకు తల్లిదండ్రులు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఓ నాయకుడితో బేరసారాలు ఆడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా గంజాయి నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పటుకున్నది వాస్తవమేనని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

‘ఇంటిగ్రేటెడ్’ స్కూళ్లకు స్థలాలు గుర్తించండి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య
- నాలుగు జిల్లాల కలెక్టర్లతో సమావేశం

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు గురువారంలోపు స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కార్యదర్శి కృష్ణ ఆదిత్య అన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా రానున్న రెండేళ్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించి నాణ్యమైన విద్య అందించాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల్లో వాటి ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేయాలన్నారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణ శివారు నిషాన్‌ఘాట్‌లో గల సర్వేనంబర్ 38లో 20 ఎకరాల స్థలాన్ని కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. అన్ని హంగులతో పాఠశాల, వసతి గృహ సముదాయం నిర్మించనున్నట్లు తెలిపారు. గడువులోపు పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, కుమురంభీం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య

ఇంటర్మీడియెట్ పరీక్షలపై సమీక్ష

ముందుగా ఇంటర్మీడియెట్ విద్యాశాఖపై సంబంధిత అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో కృష్ణ ఆదిత్య సమీక్ష నిర్వహించారు. ప్రాక్టికల్, వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో రవీందర్ కుమార్‌ను ఆదేశించారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలలో హాజరు శాతం, స్లిప్ టెస్టులు, విద్యార్థుల ప్రవేశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలి

వేసవిలో మారుమూల ప్రాంతాలు, మున్సిపాలిటీలో తాగునీరు, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని కృష్ణఆదిత్య అన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఇందుకోసం అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. బోరుబావుల ఫ్లషింగ్, నీటి వనరుల మరమ్మతు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు.

గొర్రెలు ఎత్తుకెళ్లిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గంగారాం

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ శివారులో గొర్రెలను ఎత్తుకెళ్లిన నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. నారాయణపేట జిల్లా దన్వాడ మండలం గొటూరుకు చెందిన పార్ల నరేశ్..160 గొర్రెలను మేపడానికి ఇటీవల జన్కాపూర్‌కు వచ్చాడు. గుర్తుతెలియని వ్యక్తులు 33 గొర్రెలను ఎత్తుకెళ్లారని ఈనెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం కన్నెపల్లి సబ్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా బొలెరోలో గొర్రెలను తరలిస్తుండగా డ్రైవర్‌ను అదుపులో తీసుకుని విచారించారు. జన్కాపూర్‌కు చెందిన ప్రశాంత్, సంతోష్, అభిలాష్, సత్తన్న కలిసి గొర్రెలు విక్రయించారని తెలిపాడు. వాహనాన్ని సీజ్ చేసి, నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వుషూ క్రీడాభివృద్ధికి కృషి



విన్యాసాలు ప్రదర్శిస్తున్న క్రీడాకారులు



పోటీలు ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్

- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్
- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి వుషూ క్రీడాపోటీలు

ఆదిలాబాద్: రాష్ట్రంలో వుషూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి వుషూ మహిళల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వుషూ క్రీడకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రతీ జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వాలు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలను కేటాయించాయన్నారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం వుషూ విభాగంలో స్పోర్ట్స్‌కోటా కింద పోస్టల్ శాఖలో ఉద్యోగం రాగా, ప్రస్తుతం ఎస్ఎస్బీలో ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న జిల్లాకు చెందిన రాథోడ్ స్వాతిని సత్కరించారు. కార్యక్రమంలో ఉషా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమర్, పెటా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, సాయి, వుషూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గణేశ్, వేముల సతీశ్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ అన్నారపు వీరేశ్, జిల్లాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.